నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 3 : కూకట్‌పల్లి విద్యుత్ డివిజన్ పరిధిలో విద్యుత్‌లైన్ మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ చైతన్య ఓ ప్రకటనలో తెలిపారు. నేడు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వివేకానందానగర్ దేవాలయం, ఏఎస్‌రాజు నగర్, శుభోదయ కాలనీ పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

టీఎస్ఐఐసీ కాలనీలో కార్పొరేటర్ పర్యటన

దుండిగల్,ఫిబ్రవరి3: సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నట్లు సూరారం డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ అన్నారు. డివిజన్ పరిధిలోని టీఎస్ఐఐసీ కాలనీలో సోమవారం ఆయన గాజులరామారం డీసీ మల్లారెడ్డితో కలిసి పర్యటించారు.ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమసంఘం నాయకులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

బాలానగర్, ఫిబ్రవరి 3 : సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరంగా ఉందని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని రాజుకాలనీకి చెందిన సత్యనారాయణ సతీమణికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ. 60 వేల చెక్కును బాధితురాలికి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం సహాయ నిధి ద్వారా ఎంతోమంది నిరుపేదలు తమ ఆరోగ్యాలను బాగు చేసుకోవడం సంతోషదాయకం అన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్‌గౌడ్ స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ హబ్‌గా కుత్బుల్లాపూర్

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్,ఫిబ్రవరి3: కుత్బుల్లాపూర్‌లో క్రీడా మైదానాలను ఏర్పాటు చేసి క్రీడలకు హబ్‌గా మార్చేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హామీ ఇచ్చారు. సోమవారం కుత్బుల్లాపూర్ మండలం స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లిటరరీ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్-2025 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌తో పాటు సీనియర్ వెటరన్ అథ్లెట్ మర్రి లక్ష్మారెడ్డి హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించినట్లయితే శారీరక దృఢత్వం పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మండల విద్యాశాఖాధికారి మండల విద్యాధికారి జెమిని కుమారి, నాయకులు కుంట సిద్ధిరాములు, సుధాకర్‌గౌడ్, సమ్మయ్యనేత, నరేందర్‌రెడ్డి, ఎల్లాగౌడ్, అసిస్టెంట్ ఎంఈఓ రమేశ్, స్లేట్ ప్రెసిడెంట్ ఎస్.ఎన్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీడిమెట్లలో స్పోర్ట్స్ మీట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

అమ్మవారి దయ ఉంటే అన్ని ఉన్నట్టే..

దుండిగల్: అమ్మవారి దయ ఉంటే అన్ని ఉన్నట్టేనని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి,191,ఎన్‌టీఆర్ నగర్‌లోని ముత్యాలమ్మ తల్లి దేవాలయం మూడో వార్షికోత్సవంలో ఎమ్మెల్యే వివేకానంద్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధన్‌రాజుయాదవ్,మాజీ కార్పొరేటర్ సుజాత,బీఆర్ఎస్ నాయకులు సాంబశివారెడ్డి,ఆలయకమిటీ చైర్మన్ మంజునాథ్ పాల్గొన్నారు.

గాజులరామారం(సర్కిల్) డివిజన్,రాజీవ్‌గాంధీనగర్, మెట్‌కానిగూడలో ఈనెల 15 నుంచి 18వరకు జరిగే శ్రీమల్లికార్జున స్వామి జాతర మహోత్సవ వాల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే వివేకానంద్ ఆవిష్కరించారు.

గాజులరామారం (సర్కిల్) డివిజన్,రావినారాయణ రెడ్డి నగర్‌లోని వరసిద్ధి వినాయకస్వామి దేవాలయం వార్షిక వేడుకల్లో ఎమ్మెల్యే వివేకానంద్ పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీవేంకటేశ్వర కల్యాణం..

జగద్గిరిగుట్ట: దేవాదాయశాఖ పరిధిలోని జగద్గిరిగుట్ట వేంకటేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం , హోమం నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వెలుపల ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై శ్రీదేవి, పద్మావతి సమేత వేంకటేశ్వర కల్యాణం వేడుకగా నిర్వహించారు. ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్లు జగన్, రావులశేషగిరి, కాంగ్రెస్ సీనియర్ నేతలు కొలను హన్మంతారెడ్డి, భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికల్లో సమస్యలు పరిష్కరించాలి

కేపీహెచ్‌బీ కాలనీలో శ్మశాన వాటికలో సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 3 : శ్మశాన వాటికల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని హిందూ, ముస్లిం, క్రిస్టియన్ శ్మశాన వాటికలను ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో శ్మశానవాటికలను అభివృద్ధి చేయగా కాంగ్రెస్ పాలనలో వాటికి పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. కేపీహెచ్‌బీకాలనీలోని ముస్లిం శ్మశానవాటికలో ముఖద్వారం నిర్మాణం చేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. క్రిస్టియన్ శ్మశాన వాటికలో కాంపౌండ్‌వాల్‌ను నిర్మించి, మూత్రశాలలను ఏర్పాటు చేయాలన్నారు.

లింక్‌రోడ్డును అభివృద్ధి చేయాలి..

కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్‌లోని ఎన్ఆర్ఎస్ఏ కాలనీ, భగత్‌సింగ్ నగర్ కాలనీల మధ్య లింక్‌రోడ్డును అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే కృష్ణారావు అధికారులను ఆదేశించారు. కాలనీలో పార్కును అభివృద్ధి చేయాలని, వాలీబాల్ కోర్టుగా తీర్చిదిద్దాలన్నారు. డైమండ్ ఎస్టేట్స్‌లో ఓపెన్ ప్లేస్ ప్లోరింగ్ పనులను పూర్తిచేయాలన్నారు. ఆయా కాలనీలలో చేపట్టిన పార్కుల అభివృద్ధి పనులను పూర్తిచేయడం లేదన్నారు. డీఈ శంకర్, ఏఈ సాయి ప్రసాద్, జలమండలి మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సాయిబాబా చౌదరి, వెంకట్‌రెడ్డి, పవన్,రాజేష్‌రాయ్, పాతూరి గోపి, పీఎల్ ప్రసాద్, పంచగంగేశ్వర్, సూర్యనారాయణ, భవాని, భారతి, చంద్రకాంతమ్మ, యూనస్ పాల్గొన్నారు.

సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలి



ఆడిట్ కోర్సు ప్రారంభోత్సవంలో వీసీ బాలకిష్టారెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 3 : శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ బాలకిష్టారెడ్డి అన్నారు. సోమవారం జేఎన్‌టీయూహెచ్ వర్సిటీలోని యూజీసీ ఆడిటోరియంలో రీసెర్చ్ మెథడాలజీస్ అన్న అంశంపై నిర్వహించిన ఒక వారం ఆడిట్ కోర్సును వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ బాలకిష్టారెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు, ప్రొఫెసర్ తులసీరాంలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత యుగంలో మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ అవసరం ఉందని, పరిశోధనాత్మక ఉత్పత్తులు రాబట్టడానికి ఇలాంటి పరిశోధనలు ఎంతో అవసరమన్నారు. ఏవియేషన్ పరిశోధన విద్యార్థులు సమయ నియంత్రణ, నిశ్చయంతో ముందుకు సాగాలన్నారు.

బీఆర్ఎస్ హయాంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి

ముస్లిం శ్మశాన వాటిక అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్

బాలానగర్, ఫిబ్రవరి 3 : ముస్లిం మైనార్టీలకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తున్నట్లు ఓల్డ్‌బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని ముస్లిం గ్రేవ్‌యార్డ్‌లో సొంత నిధులతో చేపట్టిన క్లీనింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో అన్ని వర్గాల ప్రజలకు సమాన ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోట్లాది నిధులు కేటాయింప జేసుకొని అనేక అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేసినట్లు స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయని కారణంగా తన సొంత నిధులతో ముస్లిం గ్రేవ్‌యార్డ్‌ను శుభ్రపరుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇర్ఫాన్, మజార్ హుస్సేన్ పాల్గొన్నారు.

ప్రజాపాలన కాదు..వేధింపుల పాలన

దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మాధవరం రోజాదేవి

మియాపూర్ , ఫిబ్రవరి 3: ప్రజాపాలన పేరు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం వేధింపుల పాలనను కొనసాగిస్తున్నదని వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి అన్నారు. ఆరు గ్యారంటీల అమలును విస్మరించి వాటి పేరు మీద ప్రజలను మభ్య పెడుతూ కాలం గడిపేస్తున్నదన్నారు. వివేకానందనగర్ డివిజన్ వార్డు కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్లు, ఇతర పథకాల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను కార్పొరేటర్ సోమవారం పరిశీలించారు. రోజాదేవి మాట్లాడుతూ ప్రజా పాలనలో ఆరు గ్యారంటీల పేరుతో స్వీకరించిన దరఖాస్తులలో కేవలం 40 శాతం మాత్రమే ఎంట్రీ చేశారని ఒక్క పథకం మాత్రమే ప్రజలకు దక్కిందన్నారు. ఇందిరమ్మ ఇండ్లకే కాకుండా ఆరు పథకాల దరఖాస్తులను స్వీకరించాలని ఆమె డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్లను ఎప్పటి వరకు, ఎక్కడ ఇస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలన్నారు.

కబడ్డీ పోటీల్లో కూకట్‌పల్లి లాయర్ల విజయం

ఖమ్మంలో జరిగిన మహిళా న్యాయవాదుల స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా నిర్వహించిన కబడ్డీ పోటీలలో కూకట్‌పల్లి న్యాయవాదులు విజయం సాధించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ స్పోర్ట్స్ సెక్రటరీ అరుణ్, మహిళ ప్రతినిధి సదాలక్ష్మి, కోచ్‌లు వెంకటేశ్వర్‌రావు, శ్రీదేవిలతో పాటు పోటీలలో పాల్గొని విజయం సాధించిన న్యాయవాదులకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

–కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 3 :

నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

పేట్ బషీరాబాద్‌లో నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న సీపీ అవినాశ్‌మహంతి

కుత్బుల్లాపూర్,ఫిబ్రవరి 3: ప్రజలకు సుస్థిరమైన భద్రత చర్యలు కల్పిస్తూనే, శాంతియుత సమాజాన్ని నిర్మించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సైబరాబాద్ సీపీ అవినాశ్‌మహంతి సూచించారు. సోమవారం మేడ్చల్ జోన్ పరిధి పేట్ బషీరాబాద్ ఏసీపీ కార్యాలయం నూతన భవనాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యాలయంతో పాటు 127 సీసీ కెమెరాలను ప్రారంభించారు. అనంతరం పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, అడిషనల్ డీసీపీ పురుషోత్తం, పేట్ బషీరాబాద్, మేడ్చల్ ఏసీపీలు రాములు, శ్రీనివాస్‌రెడ్డి, సీఐ విజయ్‌వర్ధన్‌తో పాటు ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యర్థాల తొలగింపునకు చర్యలు తీసుకోవాలి

డ్రైనేజీ సమస్యలను పరిశీలిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

మాదాపూర్, ఫిబ్రవరి 3: శానిటేషన్, కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. చందానగర్ సర్కిల్ పరిధిలోని మాదాపూర్, హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో కొనసాగుతున్న సీసీ రోడ్ల విస్తరణ, స్టామ్ వాటర్ డ్రైనేజీ, పార్కు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు చేస్తు హఫీజ్‌పేట్‌లోని పలు కాలనీల్లో శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్‌తో పాటు జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నల్లగండ్ల చెరువులో సీ అండ్ వేస్ట్ తొలగింపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు. చెరువు అభివృద్ధికి సీఎస్ఆర్ పద్ధతిలో చేస్తున్న నేపథ్యంలో రాంకీ వాళ్లు వ్యర్థాలను తీసుకొని పోవడం లేదని, అందుకు వెంటనే రాంకీ ప్రతినిధులతో మాట్లాడి వ్యర్థాల తొలగింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. నవోదయ కాలనీ సీవరేజ్ వాటర్, సెంట్రల్ యూనివర్సిటీ నుంచి వరద నివారణకు చేపట్టే పనులను ఆమె పరిశీలించిన అనంతరం సమస్యలను త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. చందానగర్ జోనల్ ఉపకమిషనర్ ఉపేందర్‌రెడ్డి, చందానగర్ సర్కిల్ డీసీ మోహన్‌రెడ్డిలతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో సమస్యల వెల్లువ

కేపీహెచ్‌బీ కాలనీ,ఫిబ్రవరి 3: కూకట్‌పల్లి జోన్ ఆఫీస్‌లో నిర్వహించిన ప్రజావాణికి 27 ఫిర్యాదులు వచ్చినట్లు జడ్సీ అపూర్వ్ చౌహాన్ తెలిపారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 11 ఫిర్యాదులు, ఎలక్ట్రికల్ విభాగానికి 1, ఇంజినీరింగ్ విభాగానికి 7, ఉద్యానవనం విభాగానికి 2, డీపీవో విభాగానికి 1, శానిటేషన్ విభాగానికి 4, ఎస్ఈ విభాగానికి 1 ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు. అలాగే కూకట్‌పల్లి, మూసాపేట జంట సర్కిళ్ల కార్యాలయంలో ప్రజావాణికి 14 ఫిర్యాదులు వచ్చినట్లు డీసీలు గంగాధర్, వంశీకృష్ణ తెలిపారు. కూకట్‌పల్లి సర్కిల్‌లో 3 ఫిర్యాదులకు గాను శానిటేషన్ విభాగానికి 1, టౌన్ ప్లానింగ్ విభాగానికి 1, రెవెన్యూ విభాగానికి 1 ఫిర్యాదు చేశారు. మూసాపేట సర్కిల్ పరిధిలో 11 ఫిర్యాదులు రాగా... టౌన్‌ప్లానింగ్ విభాగానికి 5, శానిటేషన్ విభాగానికి 3, ఇంజినీరింగ్ విభాగానికి 3 ఫిర్యాదులు చేశారు.

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్పందన కరువైంది. ప్రజాసమస్యలు చెప్పుకునేందుకు ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమంలో సర్కిల్ పరిధిలోని మూడు డివిజన్లు కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి నుంచి మూడు ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. వీధిదీపాల ఏర్పాటు, ఇంజినీరింగ్, శానిటేషన్ విభాగాలకు సంబంధించి మూడు ఫిర్యాదులు అందుకున్నారు. శేరిలింగంపల్లి సర్కిల్ ఉపకమిషనర్ ముకుంద్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రజావాణి కార్యక్రమంలో ఏఎంసీ శ్రవణ్, ఇతర విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి ప్రజావాణి కార్యక్రమంలో డీసీ ముకుంద్‌రెడ్డి, అధికారులు

మియాపూర్ : చందానగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి డీసీ మోహన్‌రెడ్డి పలు సమస్యలపై వినతులను స్వీకరించారు. రెవెన్యూ విభాగం నుంచి , పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ విభాగాల నుంచి నాలుగు వినతులు అందాయి. ఈ సందర్భంగా డీసీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన వినతులపై తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఆయా విభాగాల అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనను ముగించి సమస్యలను పరిష్కరించి తిరిగి ప్రజలకు సమాచారం అందించాలని డీసీ మోహన్‌రెడ్డి స్పష్టం చేసారు.

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్,గాజులరామారం జంట సర్కిళ్ల కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా డీసీలు మల్లారెడ్డి, నర్సింహ నేతృత్వంలో ప్రజల సమస్యలను స్వీకరించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని కిందిస్థాయి అధికారులకు సూచించారు.

కూకట్‌పల్లి జోన్ ఆఫీస్‌లో ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జడ్సీ అపూర్వ్ చౌహాన్



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న డీసీ మోహన్‌రెడ్డి

'లక్ష డప్పులు,వేల గొంతుకల' సభను జయప్రదం చేయాలి

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దళితసంఘాల నేతలు

దుండిగల్,ఫిబ్రవరి3: మాదిగల డప్పుల మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని దుండిగల్ మాజీ సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు కావలి గణేశ్ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపులో భాగంగా ఈనెల 7న, ఎల్బీ స్టేడియం వద్ద జరిగే లక్ష డప్పులు,వేల గొంతుకల ప్రదర్శనలో మాదిగలు,వర్గీకరణకు అనుకూలంగా ఉన్న యావత్ ప్రజానీకం పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా మహాప్రదర్శనకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహాజన వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కో కన్వీనర్ డప్పు రామస్వామి, ఎంజేఎఫ్ నాయకులు ముక్కర్ల లాలయ్య మాదిగ, డప్పు కళాకారుల సంఘం అధ్యక్షుడు మేకల నరసింహ, మహిళ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు అంజలి, మేడ్చల్ జిల్లా ఎంజేఎఫ్ కన్వీనర్ జోగు వెంకట్ మాదిగ, దుండిగల్ దళిత సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు దడ్డు రాహుల్ మాదిగ,బుడ్డోల అశోక్ మాదిగ,వీరేశ్ మాదిగ,సత్యనారాయణ మాదిగ,భిక్షపతి మాదిగ పాల్గొన్నారు.

కొండాపూర్: ఎస్సీ వర్గీకరణ అమలుకు సోమవారం కొండాపూర్ డివిజన్ పరిధిలోని సిద్ధిక్‌నగర్‌లో ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు డప్పు చప్పుడుతో తమ సంస్కృతిని చాటిచెబుతూ వినూత్న రీతిలో ప్రదర్శనలు ఇచ్చారు. ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రవికుమార్ మాదిగ, యాదయ్య మాదిగ, చందు మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద క్షత్రియులకు చేయూత

కుత్బుల్లాపూర్,ఫిబ్రవరి3: క్షత్రియ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరుపేద క్షత్రియ కుటుంబాల్లో విద్యార్థులకు, వృద్ధులకు ఆర్థిక సహాయాన్ని అందిస్తూ వారిలో భరోసాను నింపుతున్నారు. దీనిలో భాగంగానే సోమవారం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో నార్త్ ఎన్‌సీఎల్ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జయభేరి కాలనీకి చెందిన నమ్మతదేవికి పదోతరగతిలో 10/10 జీపీఏ వచ్చిన సందర్భంగా రూ. 10 వేలు, ఇంజినీరింగ్‌లో ప్రతిభ కనబర్చిన పెనుమత్స సూర్య అఖిల్‌వర్మకు, రూ.20 వేలు కొంపల్లి ఉమామహేశ్వర్‌కాలనీకి చెందిన ఒంటరి మహిళ నాగదేవి ఆర్థిక ఇబ్బందులతో ఉండటంతో రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. అదే కాలనీకి చెందిన దివ్యాంగురాలు కూనవరాజు వెంకటలక్ష్మికి ప్రతి నెల వెయ్యి రూపాయాల పింఛన్‌ను అందించేందుకు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు పొత్తూరి శివాజీరాజు మాట్లాడుతూ దాతల సహకారంతో రానున్న రోజుల్లో అసోసియేషన్ కార్యక్రమాలు మరింత విస్తృతం చేసి, అర్హులైన క్షత్రియ కుటుంబాల విద్యార్థులకు, పేదలకు విద్య, వైద్యం ఖర్చులను అందించేందుకు ముందుంటామని భరోసాను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు చిరంజీవిరాజు, ప్రధాన కార్యదర్శి నాని, కోశాధికారి భానుకుమార్, సభ్యులు సుధీర్, చైతన్యవర్మ, బంగారు రాజు తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి.. కేసు నమోదు

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 3: మణికొండ పోచమ్మ బస్తీలో మద్యం మత్తులో యువకులు వీరంగం సృష్టించి ఓ యువకుడిపై దాడికి పాల్పడిన ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మణికొండ పోచమ్మ బస్తీకి చెందిన నాగార్జున హాకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో డిగ్రీ చదివుతున్నాడు. చదువుతో పాటు పార్ట్‌టైం జాబ్‌లో భాగంగా ర్యాపిడో బైక్ నడుపుతున్నాడు. సోమవారం తెల్లవారుజామున విధులు ముగించుకొని మణికొండ పోచమ్మ బస్తీలోని ఇంటికి వెళ్తున్నాడు. కాగా అప్పటికే బస్తీలో దారికి అడ్డంగా బైకులు నిలిపి కొందరు ఆకతాయిలు మద్యం మత్తులో హల్‌చల్ చేస్తున్నారు. దీంతో అది గమనించిన నాగార్జున వారిని చూసి పక్కనుంచి వెళ్తుండగా ఆకతాయిలు అతడిని బూతులు తిట్టారు. దీంతో ఆగకుండా వెంటవెళ్లి ఇంటివద్ద నాగార్జునపై దాడికి దిగారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 3 : గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జనవరి 30న కేపీహెచ్‌బీ కాలనీలోని జేఎన్‌టీయూహెచ్ వర్సిటీకి ఎదురుగా ఉన్న సర్వీస్ రోడ్డులో ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నాడని 108కు ఫోన్ రావడంతో...అంబులెన్స్ సిబ్బంది అతడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకోచ్చారు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని చికిత్స కోసం వెంటనే గాంధీ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతున్న ఆ వ్యక్తి ఆదివారం మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం అందించారు. గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జీడిమెట్లలో..

జీడిమెట్ల: గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం లభ్యమైన ఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం చింతల్ లోని రిడ్జ్ టవర్ సమీపంలో ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సంఘటన స్థలంలో లభించిన వివరాల మేరకు అతడి పేరు కాశీమణి యాచకుడిగా గుర్తించారు. మృత దేహాన్ని గాంధీ దవఖానాకు తరలించి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ చోరీల నిందితుల రిమాండ్

జీడిమెట్ల, ఫిబ్రవరి 3 : ఓఎల్ఎక్స్‌లో అమ్మకానికి ఉన్న బైకులు కొంటామని వచ్చి టెస్ట్ డ్రైవ్ చేస్తామంటూ వాహనా